

కామారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఓటు వేసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన ఓటర్లు


గోపాల్‌పేట్‌లో బ్యాలెట్ బాక్సులను బస్సులో తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

# పోలింగ్ ప్రశాంతం

- భారీగా నమోదైన ఓటింగ్ శాతం
- ఉదయం నుంచే బారులు తీరిన ఉపాధ్యాయులు
- పట్టభద్రుల కన్నా ఎక్కువగా 'టీచర్' పోలింగ్
- ఉదయం మందకొడిగా.. మధ్యాహ్నం తర్వాత జోరుగా..
- ఓటేసిన ప్రముఖులు..
- కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్లు

## ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

ఖలీల్‌వాడి/కంఠేశ్వర్/కామారెడ్డి, ఫిబ్రవరి 27 : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల కంటే ఉపాధ్యాయులే ఓటేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపించారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 92.46 శాతం, కామారెడ్డిలో 93.63 శాతం ఓటింగ్ నమోదు కాగా, పట్టభద్రుల స్థానానికి సంబంధించి నిజామాబాద్‌లో 76.72 శాతం, కామారెడ్డిలో 78.12 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం తర్వాత పుంజుకున్నది. నిర్దేశిత గడువు సాయంత్రం 4 గంటలు ముగిసే సమయానికి చాలా చోట్ల ఓటర్లు లైన్లలో వేచి ఉన్నారు. దీంతో వారందరికీ ఓటేసేందుకు అవకాశం కల్పించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సీజ్ చేశారు. వాటిని ప్రత్యేక వాహనాల్లో కట్టుదిట్టమైన భద్రతతో కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.






ఓటు హక్కు వినియోగించుకున్న ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

### పటిష్ఠ ఏర్పాట్లు..

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంతో పాటు ఉపాధ్యాయ శాసనమండలి స్థానానికి నిర్వహించిన ఎన్నికలకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లా యంత్రాంగం పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టింది. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులను భారీగా మోహరించారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి కామారెడ్డి జిల్లాలో 25, నిజామాబాద్‌లో 33 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రులకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 81 ఓటింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు జిల్లాల కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆశీష్ సంగ్వాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. పలు కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కలెక్టరేట్ నుంచి వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ నిర్వహణను పరిశీలించారు.






మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**జిల్లాల వారీగా నమోదైన ఓటింగ్ శాతం**

| జిల్లా | గ్రాడ్యుయేట్లు | టీచర్లు |
|---|---|---|
| కామారెడ్డి | 78.12 | 93.63 |
| నిజామాబాద్ | 76.72 | 92.46 |



నిజామాబాద్ నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్‌లో ఓటర్ల క్యూ



కామారెడ్డి పట్టణంలో పోలింగ్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

### ఓటేసేందుకు బారులు తీరిన టీచర్లు..

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటర్లు బారులు తీరారు. ఉదయం మందకొడిగా పోలింగ్ ప్రారంభం కాగా, మధ్యాహ్నం తర్వాత ఊపందుకున్నది. సాయంత్రం 4 గంటలకు గేట్లకు తాళాలు వేశారు. ఆ తర్వాత వచ్చిన వారిని లోనికి అనుమతించలేదు. అప్పటికే కేంద్రాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లు లైన్లలో బారులు తీరారు. వారందరికీ ఓటేసే అవకాశం కల్పించారు. ఉమ్మడి జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీకి మొత్తం 5,762 మంది ఓటర్లు ఉండగా, 93 శాతానికి పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు జిల్లాల్లో కలిపి 47,984 మంది పట్టభద్రులుంటే, దాదాపు 80 శాతం మంది ఓటేశారు. గత ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరగడం గమనార్హం. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టర్లు ఆశీష్ సంగ్వాన్, రాజీవ్‌గాంధీ హన్మంతు ఓటేశారు. కామారెడ్డిలోని బాలుర ఉర్దూ పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, లింగంపేట్‌లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ నేత రాంకిషన్‌రావు తదితరులు ఓటు వేశారు.

### వీల్‌చైర్స్ లేక ఇక్కట్లు..

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్స్ అందుబాటులో లేక అవస్థలు పడ్డారు. ముబారక్‌నగర్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ నడవలేని స్థితిలో ఉండగా, వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడున్న పోలీసు సిబ్బంది ఇతరులతో కలిసి చేతులతో పట్టుకుని వెళ్లి ఓటు వేయించారు. పలుచోట్ల ఇలాంటి పరిస్థితులే ఉత్పన్నమయ్యాయని సమాచారం.

### కామారెడ్డిలోనే అత్యధికంగా..

నిజామాబాద్ కన్నా కామారెడ్డిలోనే అత్యధికంగా పోలింగ్ నమోదైంది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో టీచర్లు, పట్టభద్రులు భారీగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 29 పోలింగ్ కేంద్రాల్లో గ్రాడ్యుయేట్లు 78.12 శాతం, ఉపాధ్యాయులు 93.63 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, బ్యాలెట్ బాక్సులను కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోని 173 వ పోలింగ్ స్టేషన్‌లో ఆయన ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి ఓటేశారు. పోలీసు బందోబస్తుపై ఎస్పీ సింధూశర్మ ఎప్పటికప్పుడు సమీక్షించారు. లింగంపేట్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ఓటర్ల సహాయార్థం బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన టెంట్ వద్ద జనాలు భారీగా గుమిగూడడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈ క్రమంలో ఆ పార్టీ నేత రాంచందర్‌పై ఎలారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు చేయి చేసుకోవడం కలకలం రేపింది. భిక్కనూరులో టెంట్ తొలగింపుపై పోలీసులకు, బీజేపీ నేతలకు స్వల్ప వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్ పార్టీ టెంట్ తొలగిస్తేనే తాము తొలగిస్తామనడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.

శివరాత్రి స్పెషల్

# రసవత్తరంగా కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్/రుద్రూర్/నవీపేట, ఫిబ్రవరి 27: ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం కుస్తీ పోటీలు నిర్వహించారు. నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం, రుద్రూర్ మండలం చిక్కడ్‌పల్లి, నవీపేట మండలంలోని జన్నేపల్లి గ్రామాల్లో ఆలయాల వద్ద కుస్తీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి మహారాష్ట్ర నుంచి సైతం మల్లయోధులు తరలి వచ్చారు. రూ.50 కుస్తీ మొదలుకుని రూ.2వేలకు కుస్తీ పోటీలు నిర్వహించగా.. ఆద్యంతం రసవత్తరంగా సాగాయి. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నస్రుల్లాబాద్ మండలం మైలారం గ్రామంలో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

# వాగులనూ తోడేస్తున్నారు..



పాల్వంచ గ్రామశివారులో ఉన్న ఇసుక డంపులు

- పాల్వంచ వాగులో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో జోరుగా ఇసుక దందా
- రహస్య ప్రాంతాల్లో ఇసుక డంపులు
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 27 : ఉమ్మడి జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపులేకుండా పోతున్నది. ఇసుక దందాను అరికట్టడానికి అధికార యంత్రాంగం ఎన్ని చర్యలు చేపట్టినా, ఎన్నిసార్లు హెచ్చరించినా ఇసుకాసురుల్లో ఇసుమంతైనా మార్పురావడంలేదు. అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి, పాల్వంచ మండలాలు ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారుతున్నాయి. పాల్వంచ వాగు పరీవాహక గ్రామాలైన అరెపల్లి, భవానీపేట, పాల్వంచ, వాడి, ఫరీద్‌పేట, బండరామేశ్వర్‌పల్లి, మంథనిదేవునిపల్లి, ఇసాయిపేట,లక్ష్మీరావులపల్లి, లచ్చాపేట , చుక్కాపూర్ గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికారుల అండదండలతో ఇసుక మాఫియా టిప్పర్, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నది. వాగు పరీవాహక ప్రాంతం పాల్వంచ, మాచారెడ్డి రెండు మండలాల్లో ఉన్నది. ఆయా గ్రామాల్లో ఇసుకాసురులు ముఠాగా ఏర్పడి రాత్రివేళ పొక్లెయిన్ల సాయంతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. టిప్పర్లలో లోడ్ చేసి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు.

**తూతూ మంత్రంగా తనిఖీలు**

ఉమ్మడి మాచారెడ్డి మండలం నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇంతజరుగుతున్నా పోలీసు అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తూ..నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నా పోలీసులు కనీసం ట్రాక్టర్లు, వే బిల్లులు లేని టిప్పర్లను ఆపిన దాఖలాలు లేవు. అధికారుల అండదండలతోనే ఇసుకాసురులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**ఇసుక డంపులకు వేలం నిర్వహించాలి**

మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట గ్రామశివారులో ఇసుక డంపులను ఈనెల 21 న రెవెన్యూ అధికారులు సీజ్ చేసి, ఈ నెల 24న వేలం నిర్వహించారు. అదే విధంగా వాగు పరీవాహక ప్రాంతంలోని గ్రామాల్లో అక్రమంగా ఇసుక డంపులు చేశారని, వాటిని కూడా సీజ్ చేసి వేలం నిర్వహించాలని మండల వాసులు కోరుతున్నారు.

**ఇసుక రవాణాకు అనుమతిలేదు..**

మండలంలో ఇసుక రవాణాకు పర్మిషన్ లేదు. కేవలం ప్రభుత్వ పనులకు మాత్రమే అనుమతి ఉన్నది. ఇసుక అక్రమంగా డంపు చేస్తే సీజ్ చేస్తాం. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయాలి.

- శ్వేత, తహసీల్దార్, మాచారెడ్డి



బండరామేశ్వర్‌పల్లి శివారులో ఉన్న ఇసుక డంపులు



ధర్పల్లి మండలం దుబ్బాకలో ఎండిపోయిన వరి పంట

# చి'వరి' తడికోసం .. రైతన్నల పాట్లు

- వట్టిపోతున్న బోర్లు.. ఎండుతున్న పంటలు
- పశువులకు దాణాగా పొలాలు
- పట్టించుకోని అధికారులు
- ధర్పల్లి మండలంలో సాగునీటి కష్టాలు

ధర్పల్లి, ఫిబ్రవరి 27 : దశాబ్ద కాలం వ్యవసాయాన్ని పండుగలా చేసుకొని ఆనందించిన రైతన్నలు నేడు ఆందోళన చెందుతున్నారు. ఏడాదికాలంగా సర్కారు నిర్లక్ష్యానికి గురై.. సాగు భారమై ఆగమాగమవుతున్నారు. పంటలకు చివరి తడులు అందక అల్లాడిపోతున్నారు. వరి పంటలు వేసిన నేల.. నీరందక నెర్రెలు బారి పచ్చని పంట పొలాలు కండ్ల ఎదుటే ఎండిపోతుంటే ఏం చేయాలో తెలియక రైతన్నల గుండె తరుక్కు పోతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేసినా పంటను రక్షించుకోలేక ఎండిన పంటను చూస్తూ తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ధర్పల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో యాసంగి పంటలు వేసిన రైతులకు కన్నీరే మిగులుతున్నది. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో పంటలు సగానికి సగం ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. మండల కేంద్రంలోని భీమ్‌గల్ రోడ్డు వాడి, హోన్నాజీపేట్ గ్రామాల పరిధిలో, దుబ్బాక, గోవింద్‌పల్లి గుడి తండా గ్రామాల పరిధిలో వరికి నీరందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం చివరి తడుల కన్నా ముందుగానే పంటలకు నీరందక ఎండిపోవడం ఇదే మొదటిసారని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. చివరి తడులు మార్చి, ఏప్రిల్ వరకు అందక పంటలు ఎండిపోతుండే. కానీ ఫిబ్రవరిలోనే భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోర్లు వట్టిపోతున్నాయి. బోర్లలో నీరు రాక, వేసిన పంటలను రక్షించుకోలేక సగం పంటను పశువులకు మేత కోసం వదిలేస్తున్నారు. మిగతా సగం పంటలకే నీళ్లు పట్టిస్తూ కాపాడుకునేందుకు నానా కష్టాలు పడుతున్నారు.

### వట్టిపోతున్న బోర్లు

మండలంలోని గుడితండాకు చెందిన రాంచందర్ అనే రైతుకు చెందిన బోరు 15 రోజుల క్రితమే నీళ్లు పోయడం పూర్తిగా తగ్గిపోయింది. దీంతో 500 ఫీట్లు ఉన్న బోరును మరోమారు 815 ఫీట్ల వరకు తవ్వించగా నీరు అంతంత మాత్రమే రావడంతో తీవ్ర ఆవేదనకు లోనవుతున్నాడు. దుబ్బాక, హోన్నాజీపేట్ తండాల్లోనూ 700 నుంచి 750 ఫీట్ల వరకు బోర్లు వేసినా చుక్క నీరు రాని పరిస్థితి నెలకొన్నది.

### పశువులకు మేతగా ..

సాగునీరందక చివరికి సగం పంటను పశువులకు దాణాగా వదిలేస్తున్నారు. లేదంటే పూర్తి పంట దెబ్బ తినే అవకాశం ఉన్నది. సగం పంటనైనా కాపాడుకోవాలన్న తాపత్రయంతో పచ్చగా ఎదిగి ఎండిపోతున్న వరి పంటను పశువులకు వదిలేస్తున్నారు. ధర్పల్లి కళాశాల తండాకు చెందిన కడావత్‌నంద్య అనే రైతు తన రెండెకరాల పొలంలో ఎకరం వరకు ఎండిపోవడంతో గొర్రెలు, పశువులకు దాణాగా వదిలేశాడు. ఇంతటి దుర్భర పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఏ ఒక్క అధికారి వచ్చి చూసిన పాపాన పోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**పోలీసు బందోబస్తు మధ్య నీటి విడుదల**

భూగర్భజల వనరులు అడుగంటిపోతుండడంతో చెరువుల నుంచి నీటి విడుదల చేయడానికి రైతులు ఒప్పుకోవడంలేదు. దీంతో అధికారులు పోలీసు బందోబస్తు మధ్య నీటిని విడుదల చేయాల్సి వచ్చిందంటే పరిస్థితులు ఎంత దిగజారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. నడిమి తండా పరిధిలోని ముత్యాల వాగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు వెళ్లగా.. నడిమి తండా వాసులు అడ్డుకొన్నారు. వారం రోజులైనా సమస్య కొలిక్కిరాకపోవడంతో గత శుక్రవారం ఇరిగేషన్ ఏఈ రాంప్రసాద్ పోలీసుల రక్షణతో ముత్యాల వాగు ప్రాజెక్టు నుంచి లక్ష్మీ చెరువు తండా, ఊర చెరువుకు నీటిని విడుదల చేయడం గమనార్హం.



**నీరందక పశువులకు మేతగా వదిలేశా..**

నాకున్న రెండెకరాల్లో ఏసిన వరి పంటకు నీళ్లందడంలేదు. దీంతో ఎకరం వరకు వరి పంటను గొడ్డుగోజాలకు తినడానికి ఇడిసిపెట్టిన. పొలం జూస్తే చానా బాధయితున్నది. కానీ కొంత పొలాన్ని ఇడిసిపెట్టకపోతే ఉన్న పొలం మొత్తం ఎండిపోయేటట్టుంది. అందుకే ఎకరం దాక పొలంను నీళ్లు లేక ఇడిసిపెట్టిన. సర్కార్ మమ్ములను ఆదుకోవాలి.

- కడవాత్ నంద్య, రైతు, కాలేజీ తండా, ధర్పల్లి



**కౌలు చేసిన పొలం ఎండిపోయింది**

నాకు కొంత వ్యవసాయ భూమి ఉన్నది. నేను ధర్పల్లిలోని చోటేమియా మాముల్ల వద్ద రెండెకరాలు, ఇంకొల్ల దగ్గర కౌలుకు తీసుకుని వరి పంట ఏసినా. దాంట్ల నీళ్లు సరిగ్గా లేక పంటలకు నీళ్లందక ఎండిపోతున్నది. ఉన్న పంటను కొంతైనా కాపాడుకుందామని ఎకరం కాపాడుతున్న. గవర్నమెంట్ మాలాంటి వాళ్లకు సాయం చేసి ఆదుకోవాలి.

- బదావత్ రాంజీ, రైతు, సీతాయిపేట్ గుడితండా, ధర్పల్లి